క్లుప్తంగా

ఆర్యవైశ్య సత్రంలో అన్నదానం



నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలోని ఆర్య వైశ్య అన్నదాన సత్రంలో ఆదివారం చంద్ర షాషింగ్ మాల్ సహకారంతో 200మందికి అన్నదానం చేశారు. ముఖ్య అతిథిగా ఎంవీరెడ్డి హాస్పిటల్ అధినేత డాక్టర్ సృజన పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తుల కోసం ప్రతి ఆదివారం అన్నదానం నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈ సందర్భంగా సిగినంశెట్టి కృష్ణకుమారి ఆధ్వర్యంలో శ్రీ సంతాన వేణుగోపాలస్వామి భజన మండలి ఆధ్వర్యంలో 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో చేగు వెంకటేశ్వరరావు, రావి వెంకటసుబ్బారావు, ఏవీఆర్‌కే సత్యనారాయణ, కనుమర్లపూడి నరసింహారావు, తాడువాయి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు లక్ష్యం



చిలకలూరిపేట: ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన మంచినీరు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. పట్టణంలోని పురుషోత్తమపట్నంలో ఎన్టీఆర్ సుజల స్రవంతి ప్లాంట్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుజల స్రవంతి ద్వారా సురక్షితమైన మంచినీటిని ప్రతి ఇంటికీ అందజేస్తామని తెలిపారు. ఈ పథకం ద్వారా రూ. 2కే 20 లీటర్ల శుద్ధి చేసిన నీటిని అందించనున్నట్లు చెప్పారు. పట్టణ పరిధిలోని శివారు ప్రాంత ప్రజలకు సైతం మినరల్ వాటర్ సరఫరా చేయడమే లక్ష్యంగా ఈ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట రాజా రమేష్, టీడీపీ నాయకులు అచ్చుకోల విజయభాస్కర్, తోట బ్రహ్మస్వాములు, మిరియాల రత్నకుమారి పాల్గొన్నారు.

మున్సిపల్ మాజీ చైర్మన్ మాజేటి వెంకటేశ్వర్లు మృతి



వెంకటేశ్వర్లు (ఫైల్)

చిలకలూరిపేట: మున్సిపల్ మాజీ చైర్మన్, ఆర్య వైశ్య ప్రముఖుడు మాజేటి వెంకటేశ్వర్లు (88) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ధర్మ సంఘం గౌరవ అధ్యక్షుడిగా, శ్రీవెంకటేశ్వరస్వామి ఆర్యవైశ్య కల్యాణ మండపం మాజీ అధ్యక్షుడిగా, పలు వర్తక సంఘాలకు అధ్యక్షుడిగా వ్యవహరించిన ఆయన సమాజంలో మంచి గుర్తింపు పొందారు. మాజీ శాసన సభ్యుడు స్వర్గీయ సోమేపల్లి సాంబయ్య అనుచరుడిగా రాజకీయాల్లో ప్రవేశించి మున్సిపల్ చైర్మన్‌గా రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేసుకున్నారు. ఆయన మృతి సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పాత పశువుల సంత బజారులో ఉన్న ఆయన నివాసానికి పలువురు పట్టణ ప్రముఖులు వెళ్లి, భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

విజయపురిసౌత్: విజయపురిసౌత్‌లోని సాగర మాత ఆలయం వద్ద పేదలకు స్థానిక ఫ్లైటెక్ ఏవియేషన్ ఎండీ కెప్టెన్ మమత ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం కెప్టెన్ మమత మాట్లాడుతూ చలి తీవ్రత దష్ట్యా పేదలకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వృద్ధులు జాగ్రత్తలు పాటించాలని ఆమె సూచించారు. సీనియర్ ఇన్‌స్పెక్టర్ సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లన్నీ గుంతలు..ప్రజల కళ్లకు గంతలు

- గుంతలు లేని రోడ్లు పల్నాడు ప్రజలకు కష్టమే..
- ఆర్ అండ్ బీ మేజర్ రోడ్లపై రూ.38.56కోట్లతో పనులు
- ఇప్పటివరకు చేసింది రూ.3.5కోట్ల పనులు మాత్రమే..
- ఇంకా టెండర్ల దశలోనే మరికొన్ని
- సంక్రాంతి నాటికి పూర్తి చేస్తామంటున్న అధికారులు



గుంతలతో అధ్వానంగా ఉన్న నరసరావుపేట మండలంలోని చినతురకపాలెం వద్ద రోడ్డు

నరసరావుపేట: రోడ్ల మరమ్మతుల్లో కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. అధికారంలోకి వస్తే ప్రజలు గుంతలు లేని రోడ్లు చూస్తారంటూ మభ్యపెట్టింది. ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చి ఆర్నెల్లు గడుస్తున్నా గుంతలు పూడ్చలేని దైన్యస్థితిలో ప్రభుత్వాన్ని నెట్టుకొస్తున్నారు. ప్రజలను గాలికి వదిలేశారు. ఇసుక, గనులు రంగాల్లో డబ్బులు దండుకోవడంపై దృష్టి సారించారు. ప్రస్తుతం గుంతలు పూడ్చే కార్యక్రమానికి కేవలం ఆర్ అండ్ బీ రోడ్లనే ఎంచుకున్నారు. దీంతో పలు గ్రామాల ప్రజలతో పాటు మున్సిపాలిటీల్లో సైతం అధ్వాన రోడ్లపై ప్రయాణాలు కొనసాగిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రెండు పేజ్‌లుగా మరమ్మతులు

జిల్లావ్యాప్తంగా మొత్తం ఏడు నియోజకవర్గాల్లోని మేజర్ రోడ్లలో 933 మీటర్ల మేర గుంతలకు మరమ్మతులు చేయాలని రోడ్లు భవనాల శాఖ అధికారులు నాలుగు నెలల క్రితమే ప్రభుత్వానికి నివేదించారు. వీటిని పూడ్చేందుకు రూ.38.56కోట్లు ఖర్చు అవుతుందని లెక్కలు వేశారు. ప్రతిపక్షం, ప్రజల నుంచి వస్తున్న ఒత్తిళ్లతో నూతన రోడ్లను వేయకపోయినా కనీసం గుంతలైనా పూడ్చాలనే ఉద్దేశంతో రెండు పేజ్‌లుగా మేజర్ రోడ్లపై గుంతలు పూడ్చే కార్యక్రమం చేపట్టారు. దీంతో ప్రభుత్వం అక్టోబరులో విడుదల చేసిన జీవో 53 ప్రకారం ఫేజ్–1గా జిల్లావ్యాప్తంగా 279.987మీటర్ల రోడ్లకు రూ.7.38కోట్లతో 38పనులుగా విభజించి టెండర్లను పిలిచి కాంట్రాక్టర్లకు అప్పగించారు. నవంబరు 15న ప్రభుత్వం విడుదల చేసిన జీవోలు 348,349 ఆదేశాల మేరకు ఏడు నియోజకవర్గాల్లోని 653మీటర్ల గుంతలను రూ.23.17కోట్ల వ్యయంతో 78పనులుగా విభజించి టెండర్లను ఆహ్వానించారు. వీటిలో జిల్లాలోని నియోజకవర్గాల్లో 17చోట్ల రూ.8కోట్ల వ్యయంతో చేపట్టే క్రాస్ డ్రైనేజ్ (సీడీ) పనులు (కల్వర్టు రిపేర్) పనులు ఉన్నాయి. మొదటి ఫేజ్ కింద పనులు జరుగుతుండగా, రెండో ఫేజ్‌లో పిలిచిన టెండర్లు తెరిచి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించాల్సి ఉంది. ప్రభుత్వం ఏర్పడి ఆర్నెల్లు గడిచినా ఇప్పటివరకు 164మీటర్ల రోడ్ల పైనున్న గుంతలను మాత్రమే పూడ్చే కార్యక్రమం చేపట్టారు. దీనికి రూ.3.5కోట్లు మాత్రమే ఖర్చు చేస్తున్నారు. ఇప్పటి వరకు పట్టుమని పది గ్రామాల్లో రోడ్లను పూడ్చలేకపోయారనే విమర్శలను ప్రజల నుంచి ఎదుర్కొంటున్నారు.



గోనెపూడి–కోటప్పకొండ రోడ్డు దుస్థితి

జిల్లా కేంద్రంలో దారుణం

జిల్లా కేంద్రమైన నరసరావుపేట నియోజకవర్గంలోని సుమారు 1.40లక్షలమంది పురపాలక ప్రజలు, మరో 1.40లక్షలమంది జనాభా నివాసం ఉండే నరసరావుపేట, రొంపిచర్ల మండలాల్లోని గ్రామాల్లో రోడ్లు అధ్వానస్థితిలో ఉన్నాయి. పురపాలక పరిధిలో అధ్వానంగా మారిన సీసీరోడ్లపై రూ.22లక్షల వ్యయంతో గుంతలు పూడ్చే కార్యక్రమం ఇటీవలనే చేపట్టారు. ములకలూరు–పెదరెడ్డిపాలెం రోడ్డు, నరసరావుపేట నుంచి వయా కోటప్ప కొండ రోడ్డు మీదుగా వెళ్లే చిలకలూరిపేట రోడ్డు ములకలూరు–పమిడిపాడు రోడ్డు, పాలపాడు రోడ్డు, సత్తెనపల్లి రోడ్డులోని ఇసప్పాలెం పరిసరాల రోడ్డు, ఇసప్పాలెం నుంచి గుంటూరు రోడ్డు వరకు ఉన్న బైపాస్ రోడ్డు అధ్వానంగా మారాయి. వీటికి మరమ్మతులు ఎప్పుడు చేస్తారోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

వచ్చే సంక్రాంతి నాటికి పూర్తి చేస్తాం



మొదటి ఫేజ్ పనులు పూర్తి కావొచ్చాయి. రెండో ఫేజ్ పనుల టెండర్లను అప్పగించే పనిలో ఉన్నాం. వచ్చే 40రోజుల వ్యవధిలో పూర్తి చేసి సంక్రాంతి నాటికి గుంతలు లేని పల్నాడు జిల్లాను ప్రజలకు అందజేస్తాం.

–కె.రాజానాయక్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఆర్ అండ్ బీ

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

నాదెండ్ల: నాదెండ్ల విద్యుత్ సబ్ స్టేషన్, తూబాడు ఫీడర్ మార్పుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఏఈ ఆర్. అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 – మధ్యాహ్నం 3 గంటల వరకు తూబాడు, చిరుమామిళ్ల, గొరిజవోలు, సంకురాత్రిపాడు, జంగాలపల్లె గ్రామాలకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వాసవీ సేవాసమితి జిల్లా అధ్యక్షుడిగా పుల్లారావు



దాచేపల్లి: పల్నాడు జిల్లా వాసవీ సేవా సమితి అధ్యక్షుడిగా నారాయణపురంకి చెందిన గరిణే పుల్లారావు నియమితులయ్యారు. ఆదివారం నరసరావుపేటలో జరిగిన సమితి కార్యవర్గ సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా పుల్లారావుని నియమిస్తూ సమితి వ్యవస్థాపకులు చీతిరాల పెద్దన్న నియామకపత్రం అందజేశారు. ఆర్యవైశ్యులకు అన్ని విధాలుగా తాను అండగా ఉంటానని, త్వరలోనే జిల్లా నుంచి మండల కమిటీలు ఏర్పాటు చేస్తామని పుల్లారావు చెప్పారు. పుల్లారావు నియమకంపై మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ కనిగిరి విశ్వనాథం, మాజీ డైరెక్టర్ మండ్లేం రామారావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

భగవద్గీత కంఠస్థ పోటీలకు స్పందన

నరసరావుపేట ఈస్ట్: గీతా జయంతి పురస్కరించుకొని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకుసుమ హరనాథ్ కల్యాణ మండపంలో భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. విద్యార్థులను 6, 7 తరగతులు, 8, 9తరగతులు వారీగా విభజించి, 700 శ్లోకాలను కంఠస్థం చేసిన వారికి పోటీ నిర్వహించారు. వంద మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.1000, ద్వితీయ బహుమతిగా రూ.750, తృతీయ బహుమతిగా రూ.500ను నిర్వాహకులు అందజేశారు.



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో నిర్వాహకులు

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

బొల్లాపల్లి : గ్రామాల్లో వివాదాలు లేకుండా కలిసిమెలసి జీవించాలని వినుకొండ రూరల్ సీఐ బి.ప్రభాకరరావు తెలిపారు. మండలంలోని మూగచింతలపాలెంలో శనివారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులకు రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, స్వల్ప సమస్యలను పరిష్కరించుకునే విధానంపై అవగాహన కల్పించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రూరల్ సీఐ ప్రభాకరరావు, బండ్లమోటు ఎస్. ఎ.బాలకృష్ణలు రాత్రి బస చేశారు.



పల్లె నిద్రలో పాల్గొన్న రూరల్ సీఐ ప్రభాకరరావు, బండ్లమోటు ఎస్ఐ బాలకృష్ణ

విప్పర్లపల్లిలో పల్లె నిద్ర

రొంపిచర్ల: కక్షలు, కార్పణ్యాలకు పోయి పిల్లల భవిష్యత్తును పాడు చేసుకోవద్దని నరసరావుపేట డీఎస్పీ కె. నాగేశ్వరరావు సూచించారు. మండలంలోని విప్పర్లపల్లిలో శనివారం రాత్రి నిర్వహించిన పల్లె నిద్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలో సమస్యలు వస్తే సామరస్యంగా పరిష్కరించుకోవాలని తెలిపారు. కోపతాపాలకు పోయి సమస్యను జటిలం చేసుకుంటే కేసులై ఇబ్బందులు పడాల్సి వస్తుందని, కుటుంబాలు, పిల్లల భవిష్యత్తు నాశనం అవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా దళితవాడలో పర్యటించారు. అక్కడి ప్రజలతో మమేకమై, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి చిన్న విషయానికి కోపతాపాలతో దాడులు చేసుకొని కేసులు పెట్టుకోవద్దని, ఏదైనా సమస్య ఉంటే తమ వద్దకు రావాలని తెలిపారు. అనంతరం పల్లె నిద్రకు ఉపక్రమించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ పసుపులేటి రామకృష్ణ, ఎస్ఐ డి. అశోక్, గ్రామ సర్పంచ్ గాదె రామిరెడ్డి, మెట్టు వెంకటేశ్వరరెడ్డి, గాదె వెంకటేశ్వరరెడ్డి, దిబ్బయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



పల్లె నిద్రలో డీఎస్పీ నాగేశ్వరరావు, సీఐ, ఎస్ఐలు

రేపు విజయవాడలో మానవ హక్కుల దినోత్సవం

నరసరావుపేట: విజయవాడలో ఈనెల పదో తేదీన నిర్వహించే ఆదివాసి ఉద్యమాల సంఘీభావ సదస్సు కరపత్రాన్ని ప్రజా సంఘాల నాయకులు ఆదివారం ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్ 10, 11 తేదీల్లో ఢిల్లీలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా సదస్సు నిర్వహించాలని, బీజేపీ మినహా అన్ని రాజకీయ పక్షాలను ఆహ్వానించాలనే ప్రయత్నం జరిగిందని తెలిపారు. అయితే ప్రభుత్వ ఆటంకాల మధ్య ఎక్కడికి అక్కడే మానవ హక్కుల దినోత్సవం నిర్వహించి ఆదివాసి ఉద్యమాలకు సంఘీభావం ప్రకటించాలని తీర్మానించినట్లు వివరించారు. దీన్ని పురస్కరించుకొని ఈనెల 10న ఉదయం 10 గంటలకు విజయవాడ హనుమంతరాయ గ్రంథాలయంలో సదస్సు ఏర్పాటు చేశామని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) నాయకులు వై.వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మస్తాన్‌వలి, జి.రామకృష్ణ, పౌర హక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చికినం చిన్న పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కాంట్రాక్టర్ల గుండె గు‘భిల్లు’

- గడప గడప, 15వ ఫైనాన్స్ నిధులతో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు
- నెలలు గడుస్తున్నా చెల్లించని బిల్లులు
- రూ.3కోట్లు ఆపిన అధికారులు
- చెల్లింపులు చేయకపోతే ఆ భారం పురపాలక సంఘంపై పడే ప్రమాదం

నరసరావుపేట: పట్టణాభివృద్ధి కోసం చేపట్టిన పనులకు ఎప్పటికప్పుడు డబ్బులు చెల్లించి కాంట్రాక్టర్లను ప్రోత్సహించాల్సిన పురపాలక అధికారులు పక్షపాతం చూపుతున్నారు. పాము తన పిల్లలను తామే చంపి తింటున్నదనే చందంగా వ్యవహరిస్తున్నారు. పూర్తయిన రూ.3కోట్ల బిల్లులను ఉన్నతాధికారులకు ఆన్‌లైన్‌లో పంపకుండా ఆరు నెలలు ఆపి బేరసారాలకు దిగారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పట్టణంలోని 34వార్డులను అభివృద్ధి చేయాలని నిశ్చయించారు. గడపగడపకు వైఎస్సార్ సీపీ అనే కార్యక్రమం నిర్వహించారు. ఇల్లిల్లూ తిరిగి ప్రజల నుంచి సమస్యలు తెలుసుకొన్నారు. అప్పటి ప్రభుత్వం కూడా గడప గడపకూ పనులు చేపట్టేందుకు ప్రతి వార్డుకు రూ.20లక్షల కేటాయించింది. ఈ విధంగా రూ.3కోట్ల నిధులు మంజూరయ్యాయి. పలు వార్డుల్లో రూ.1కోటి వ్యయంతో కాంట్రాక్టర్లు కల్వర్టులు, సీసీ రోడ్లు, డ్రెయిన్లు, ప్యాచ్ వర్కులు చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పురపాలక సంఘానికి విడుదలైన 15వ ఫైనాన్స్ నిధులు రూ. 2కోట్లతో పనులను కూడా కాంట్రాక్టర్లు పూర్తిచేశారు. ఇంజినీరింగ్ అధికారులు అన్నీ రికార్డులు పూర్తిచేసి సీఎఫ్ఎంఎస్‌కు పంపారు.



గడపగడప నిధులతో ప్రకాష్‌నగర్ టెంపుల్ వీధిలో డ్రెయిన్ నిర్మాణం (ఫైల్)

అక్కడి అధికారులు ఆడిట్ నిర్వహించి ప్రతి బిల్లుకు కోడ్ క్రియేట్ చేశారు. ప్రభుత్వం మారగానే అధికారులు మారారు. పూర్తయిన బిల్లులను లింగంగుంట్లలోని పే అండ్ అకౌంట్ సెక్షన్‌కు ఆన్‌లైన్‌లో పంపాలి. అయితే, గత ఆరు నెలల నుంచి పంపించకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. అదేమని ప్రశ్నించిన వారిని స్థానిక ముఖ్యనేత వద్దకు వెళ్లి సెటిల్ చేసుకోమని చెబుతున్నారని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్‌గా మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకోకపోతే మురిగిపోయే ప్రమాదం ఉంది. వీటి కాల పరిమితి తీరే వరకు కాంట్రాక్టర్లకు చెల్లింపులు జరగకపోతే, ఆ నిధులను పురపాలక సంఘమే చెల్లించాల్సిన దుస్థితి ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది.

ప్రాధాన్యత ప్రకారం చెల్లింపులు

నేను వచ్చి రెండు నెలలే అవుతోంది. ఇప్పటి వరకు కాంట్రాక్టర్లకు చెల్లించే డబ్బులు పురపాలక సంఘంలో లేవు. ఉద్యోగులు, కార్మికుల జీతాలు, పురపాలక సంఘం నడిచేందుకు అవసరమైన వాటికే వినియోగిస్తున్నాం. పాత బిల్లులు అన్నింటిని తీసి సిద్ధంగా ఉంచాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించాం. ప్రాధాన్యతను బట్టి చెల్లింపులు చేస్తాం.

–ఎం.జస్వంతరావు, మున్సిపల్ కమిషనర్

‘ప్రజల దృష్టి మరల్చేందుకే పేరెంట్స్ టీచర్స్ మీట్’

నరసరావుపేట: కూటమి ప్రభుత్వం తన తప్పిదాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు పేరెంట్స్ టీచర్స్ మీట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేసిందని ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రి లోకేష్ అసెంబ్లీలో చెప్పినట్లు అమ్మఒడికి రోడ్ మ్యాప్ గురించి చర్చే జరగలేదని, పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ఏ చర్యలు తీసుకుంటున్నారో కూడా హామీ ఇవ్వలేదని తెలిపారు. ప్రాథమిక విద్యా ప్రమాణాలు పెంచేందుకు, డ్రాపౌట్స్ తగ్గించేందుకు ఏ విధంగా కృషిచేయాలో ఉపాధ్యాయులకు సూచనలు చేయలేదని విమర్శించారు. ఇవేమీ లేకుండానే 74ఏళ్ల వయస్సులో చంద్రబాబునాయుడు నేలపై కూర్చొని భోజనం చేశారని, ఆయన కొడుకు లోకేష్ ఆయన తిన్న ప్లేట్‌ను తీశారని ప్రచారమే తప్పా విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఒరిగిందేమిటని ప్రశ్నించారు.

ఘనంగా అంకమ్మ గుడి ప్రతిష్ట వేడుకలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన

వినుకొండ(నూజెండ్ల): నియోజకవర్గ ఒడియరాజుల సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని హనుమాన్‌నగర్ కొండ వద్ద శ్రీ అంకమ్మ గుడి ప్రతిష్ట మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ముగింపు రోజు సందర్భంగా అమ్మవారి, పోతురాజు ప్రతిష్ట మహోత్సవం జరిపారు. ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బత్తుల హనుమంతరావు, కుంచల తిరుమల బాబు, తన్నీరు సంతోష్, గుంజి శ్రీను, తన్నీరు వెంకయ్య, ధర్మవరపు సత్యం, వేముల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్కూల్ డేస్.. హ్యాపీ డేస్



1977-78 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

యడ్లపాడు: స్థానిక లూథరన్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆనందోత్సాహాల నడుమ జరిగింది. పదో తరగతి 1977–78 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలిశారు. ఆరో తరగతి నుంచి పది వరకు చదివినప్పటి సంఘటనలను హితులు, సన్నిహితులతో నెమరు వేసుకున్నారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించి వారి నుంచి ఆశీర్వచనాలు పొందారు. పగలంతా ఆటపాటలతో అల్లరి పిల్లల్లా సంతోషంగా గడిపారు. విశ్రాంత ఉపాధ్యాయులు జోసఫ్ నాటి విద్యా విషయాలపై ప్రసంగించారు. పూర్వ విద్యార్థులు వై.వి. రమణమూర్తి, పుసులూరి రంగాచార్యులు, ఆలోకం హరిబాబు పర్యవేక్షించిన ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థిని పి. ప్రభావతి అధ్యక్షత వహించారు.

ముమ్మరంగా వ్యవసాయ పనులు

రొంపిచర్ల: మండలంలోని ఉత్తర దిక్కు గ్రామాల్లో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. నవంబర్‌లోనే ప్రారంభం కావాల్సిన పనులు వర్షం కారణంగా నిలిచిపోయాయి. వర్షానికి వరిపైరు నేలవారడంతో హార్వెస్టింగ్ చేసేందుకు యంత్రాలు ఉపయోగపడటం లేదు. దీంతో చేసేది లేక రైతులు కూలీలనే ఉపయోగించాల్సి వస్తోంది. దీనికి తోడు పది రోజులు పనులు నిలిచి పోవడంతో కూలీలకు కొంత గిరాకీ కూడా ఏర్పడింది. పక్క గ్రామాల నుంచి వచ్చి పనులు చేస్తున్నారు. ఒక వైపు రైతులు యంత్రాలతో హార్వెస్టింగ్ చేసిన ధాన్యాన్ని ఇళ్లకు చేరవేస్తూ అమ్మకాలు నిర్వహిస్తున్నారు. మరో వైపు దాళ్వాలో వరి సాగు చేసేందుకు నారుమళ్లు కూడా సిద్ధం చేస్తున్నారు.

జోరుగా ధాన్యం అమ్మకాలు

75 కేజీల సన్న రకం ధాన్యాన్ని రూ.1600కు, లావు రకాన్ని రూ.1500 నుంచి రూ.1550 వరకు రైతులు అమ్ముకుంటున్నారు. ఇదే వాతావరణం మరో పది రోజుల పాటు కొనసాగితే ఎడ్వర్డ్‌పేట, కొత్తపల్లి, చాకలికుంట, రెడ్డిపాలెం తదితర గ్రామాల్లో ముదురుగా సాగు చేసిన వరిపైరు హార్వెస్టింగ్ పూర్తవుతుంది. ఈ నెలాఖరుకు గానీ లేత వరిపైరు కోతలకు వచ్చే అవకాశం ఉంది. వాతావరణంలో మార్పులతో పాటు మరోసారి తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు ధాన్యాన్ని నిల్వ చేసుకోలేక అమ్ముకుంటున్నారు.



వర్షాలకు నేలవారిన వరిని కోస్తున్న కూలీలు



దాళ్వా నారుమడిలో పులక తీస్తున్న రైతు